చెరువులు, కుంటలు చెరవీడేనా?

- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు
- ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు

జూలూరుపాడు: జూలూరుపాడు మండలంలోని చెరువులు, కుంటలు పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురయ్యాయి. రెండు దశాబ్దాలుగా కబ్జాకు గురికాగా, గడిచిన పదేళ్లలో మరింత అన్యాక్రాంత మయ్యాయి. అయినా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. శిఖంతోపాటు కట్టలు, పంట కాలువలు సైతం ఆక్రమణకు గురయ్యాయి. చెరువులు, కుంటల్లో అక్రమ తవ్వకాలు చేపడుతున్నా అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. చెరువు, కుంటల శిఖాన్ని సైతం పట్టాభూములుగా మార్చారు. మండలంలోని పలు చెరువులు, కుంటలు 15– 20 శాతం కబ్జా కాగా, మరికొన్ని పూర్తిగా కనమరుగు అయ్యే పరిస్థితిలో ఉన్నాయి. హైదరాబాద్‌లోని హైడ్రా తరహాలోనే ప్రతీ మండలంలో డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్‌ను ఏర్పాటు చేసి చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, ప్రభుత్వ భూములను రక్షించాలని కోరుతున్నారు.

జూలూరుపాడు మండలంలో 24 గ్రామ పంచాయతీల్లో మొత్తం 18 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటి కింద సుమారు 2,500 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువులు, కుంటల ఆక్రమణలతో నీటి సామర్థ్యం తగ్గడంతో ఆయకట్టు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయినట్లు ఆయకట్టు రైతులు చెపుతున్నారు. ఇటీవల జూలూరుపాడు రెవెన్యూ పరిధిలో గల విప్పజాల కుంట చెరువు కబ్జా చేశారని ఆరోపిస్తూ తహసీల్దార్, కలెక్టర్‌కు మాలమహానాడు నాయకులు వినతిపత్రాలు అందజేయగా,


ఆక్రమణకు గురైన పడమటనర్సాపురం తుమ్మలవాగు

వెంగన్నపాలెం జమ్మికుంట, కాకర్ల ఎర్రవాగు ప్రాజెక్టు చెరువు ఆక్రమణకు గురైందని బీఎస్పీ, గోర్‌బంజారా పోరాట సమితి నాయకులు కలెక్టర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. శిఖంలో పట్టా భూములు ఉన్నాయని, ఈ విషయంలో తాము ఏమీ చేయలేమని రెవిన్యూ అధికారులు చెపుతున్నారు. చెరువు, కుంటల శిఖంలో పట్టా భూములు ఉన్నప్పుడు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మిషన్ కాకతీయ పథకం కింద ఇరిగేషన్ అధికారులు అభివృద్ధి పనులు ఎలా చేపట్టారని రైతులు ప్రశ్నిస్తున్నారు. మిషన్ కాకతీయ పథకం నిధులు మంజూరైన శిఖంలో తమ పట్టా భూములు ఉన్నాయని రైతులు అడ్డుతగలడంతో సురారం నల్లకుంట చెరువు అభివృద్ధి పనులు చేపట్టకుండా వదిలేయగా, పాపకొల్లు దండేలచెరువు శిఖంలో పూడికతీత, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తొలగించకుండానే చెరువు కట్ట పనులు చేశారు. మిగిలిన చెరువులు, కుంటల అభివృద్ధి తూతుమంత్రంగా చేపట్టి సంబంధిత అధికారులు చేతులు దులుపుకున్నట్లు ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు.


కబ్జాకు గురైన జడలచింత లక్ష్మీదేవీకుంట చెరువు

అదేవిధంగా జడలచింత లక్ష్మీదేవీ కుంట చెరువు శిఖం 4.17 ఎకరాలు ఉండాల్సి ఉండగా, సగానికి పైగా కబ్జాకు గురికావడంతో కనుమరుగయ్యే పరిస్థితిలో ఉంది. అనంతారం ముక్కు వీరన్న కుంట, మొద్దులగూడెం (శంభునిగూడెం) దొడ్డా వెంకటరత్నం కుంట, సురారం నల్లకుంట చెరువు, పాపకొల్లు నాయపోడి కుంట, మాచినేనిపేట ఎదళ్ల చెరువు, మాచినేనిపేటతండా ఈదుల కుంట చెరువు ఆక్రమణలో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణల నుంచి చెరువులు, కుంటలను రక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు..



చెరువులు అన్యాక్రాంతమైనా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండటం లేదు. మండలంలో పలు చెరువులు, కుంటలు ఆక్రమణలోనే ఉన్నాయి. అధికారులు సర్వే చేపట్టి హద్దులు నిర్ధారించాలి. – తంబర్ల నరసింహారావు

కబ్జాలను అరికట్టాలి..



చెరువులు, కుంటల శిఖం ఆక్రమణలపై కలెక్టర్, తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేశాం. పలు చెరువులు, కుంటలు ఆక్రమణలతో కనుమరుగవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. – బానోత్ దుర్గాప్రసాద్

సర్వే చేపట్టాలి..



చెరువులు, కుంటల కబ్జాలపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేపట్టాలి. ఆక్రమణలను స్వాధీనం చేసుకుని కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి.
– వల్లోజి రమేష్, న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి

ఆక్రమణలను అడ్డుకుంటాం..



జూలూరుపాడు విప్పలజాల కుంట చెరువుతోపాటు, పలు చెరువులు ఆక్రమణలకు గురైనట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో హద్దులు నిర్ధారిస్తాం. – కిషోర్,
– డీఈ ఐబీ జూలూరుపాడు, ఏన్కూర్ మండలాలు

క్లుప్తంగా

డిపోలో సమస్యలు పరిష్కరించాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న నాయకులు

ఇల్లెందు: ఇల్లెందు బస్ డిపోలో సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డిపో ఎదుట ఆందోళన చేపట్టగా రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ మాట్లాడారు. డిపోలో బంక్ లేకపోగా, పాత బస్సుల కారణంగా డ్రైవర్లు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాగే, డిపో ఏర్పడినప్పటికీ పలు గ్రామాలకు బస్సులు నడపకపోవడంతో ఫలితం లేకుండా పోయిందని, ఇకనైనా అన్ని గ్రామాలకు సర్వీసులు ఏర్పాటు చేయడమే కాక గుండాల నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్‌లు నడిపించాలని కోరారు. నాయకులు బుర్ర వెంకన్న, రేసు బోసు, ఎదళ్లపల్లి సావిత్రి, శేషయ్య, రంజాన్, గురునాథం, యాకూబ్ షావలీ, మల్లెల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన జీఎం పర్సనల్


శ్రీనివాసరావు

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ జనరల్ మేనేజర్‌గా పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ)గా కోడూరి శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన సామ్యేల్ సుధాకర్ అక్టోబర్ 31న ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. కంపెనీ తనపై ఉన్న నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిందని, నిబద్ధతతో విధులు నిర్వహిస్తానన్నారు. అనంతరం పలువురు అధికారులు శ్రీనివాస్‌రావును అభినందించి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయండి..


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని కోరుతూ బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ వెంకటేశ్వరచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... విద్యా, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని, వారం రోజుల్లో పరిష్కరించపోతే టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.రాజు, ఎస్.వెంకటేశ్వర్లు, బి.కిషోర్‌సింగ్, ఎస్.కృష్ణ, ఎం.వెంకటేశ్వర్లు, డి.తావుర్యా, పాషా పాల్గొన్నారు.

సంత, తైబజార్ టెండర్‌పై నేడు విచారణ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో వారపు సంత, తైబజార్ టెండర్లు ఈ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా జరగలేదని, ఆ టెండర్లను రద్దు చేయాలని కోరుతూ అక్టోబర్ 15న బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఎంఏ 7వ తేదీన కొత్తగూడెం మున్సిపాలిటీలో టెండర్లపై విచారణ జరపాలని, విచారణ అధికారిగా కమిషనర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ షామిద్ మసూద్‌ను ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో టెండర్లు జరిగిన తీరుపై విచారణ జరుగనుంది.

సమస్యలు పరిష్కరించాలి


రామరాజు, సమ్మయ్య

టేకులపల్లి: జీఓ 317లో స్థానికతను కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులను వారి స్థానికతను బట్టి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని ఉపాధ్యాయ దర్శిని సంపాదకవర్గ సభ్యులు ఎం.రామాచారి, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.హరిలాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గంగారం ఆశ్రమ పాఠశాలలో జరిగిన సంఘం జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖలోని అన్ని పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి వారికి పదోన్నతులు కల్పించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. అనంతరం టేకులపల్లి మండల నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా బి.రామరాజు, ప్రధాన కార్యదర్శిగా పి.సమ్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

యూపీహెచ్‌సీలో రికార్డుల తనిఖీ


తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్

కొత్తగూడెంరూరల్: దీర్ఘకాలిక, క్యాన్సర్ వ్యాధులతో బాధపడేవారు, వయోవృద్ధుల కోసం కొత్తగూడెంలోని ప్రభుత్వాస్పత్రిలో పాలియేటివ్ కేర్ సెంటర్ అందుబాటులో ఉందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ ఎల్.భాస్కర్‌నాయక్ అన్నారు. పాతకొత్తగూడెంలోని యూపీహెచ్‌సీని బుధవారం డీఎంహెచ్‌ఓ సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. కేంద్రంలోని ఆరోగ్యసేవలను డాక్టర్ రాకేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఓపీ, ఐపీ సేవలు, అత్యవసర మందులు, ల్యాబలేటరీలో చేస్తున్న పరీక్షలు, గర్భిణుల నమోదు, సేవలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. సికిల్‌సెల్ ఎనిమియా కార్డులను పంపిణీ చేయాలని, అర్హులైన పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధిక టీకాలు ఇవ్వాలని, మధుమేహం, రక్తపోటు ఉన్న వారికి క్రమం తప్పకుండా మందులను అందజేయాలని ఆదేశించారు. 30 సంవత్సరాలు దాటిన ప్రతీఒక్కరికి ఎన్సీడీ స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. మానసిక రుగ్మతలతో బాధపడే వారి కోసం టెలిమానస్ సేవలను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ రాంప్రసాద్, ఫార్మసిస్ట్ సౌమ్య, కమల, అరుణ కావ్య పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం ముట్టడికి తరలిరండి..


మాట్లాడుతున్న సురేష్ నాయక్

టేకులపల్లి: ఏజెన్సీ ప్రజలను అధిక రేట్లతో దోచుకుంటున్న మద్యం సిండికేట్, గ్రామాల్లో విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారని సిండికేట్, బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని గత నెల 24న ఇల్లెందు ఎక్సైజ్ శాఖ అధికారికి ఫిర్యాదు లేఖ ఇచ్చినా చర్యలు తీసుకోలేదన్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈనెల 8న ఇల్లెందు ఎక్సైజ్ శాఖ కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఇల్లెందు ఎక్సైజ్ శాఖ పరిధిలోని ఇల్లందు పట్టణంతో పాటు టేకులపల్లి, గుండాల, పలు మండలాలలో మద్యం అమ్మకాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయని విమర్శించారు. ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో ప్రత్యేక గోడౌన్లను ఏర్పాటు చేసి, వైన్ షాపుల్లో అమ్మాల్సిన మద్యాన్ని బెల్ట్ షాపులకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి ఎమ్మార్పీకే మద్యాన్ని ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బానోతు కిషన్, లావుడియా వెంకటేష్, బానోతు నాగరాజు, బాదావత్ సురేష్ , జర్పుల లాలు, బోడ శేఖర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం..


ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అమరవీరులు అందించిన స్ఫూర్తితో ఉద్యమిద్దామని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి పొడుగు నర్సింహారావు పిలుపునిచ్చారు. కొమరారం గ్రామంలో బుధవారం అమరవీరుల వర్ధంతి సందర్భంగా ప్రదర్శన నిర్వహించారు. మాట్లాడుతూ.. భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం ఎందరో విప్లవకారులు ఉద్యమించి ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. నేడు ఏజెన్సీ గ్రామాలలో ప్రజలు సాగు చేసుకుంటున్న పోడు భూములు నాడు విప్లవకారులు అందించిన సహకారంతో సాధించుకున్నవేనన్నారు. ఇలాంటి అనేకం సాధించి పెట్టి అమరులైన నేతలను మననం చేసుకోవడంతోపాటు వారి ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు ఉద్యమబాటలో నడవాలని కోరారు. కార్యక్రమంలో మోతీలాల్, మూడు మాలు, జోగ కృష్ణ, వాంకుడోత్ శ్రీను, జీవన్, నర్సయ్య, పాపయ్య పాల్గొన్నారు.

అమరుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి


అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

టేకులపల్లి: అమరుల పోరాట స్ఫూర్తిగా నాయకులు, కార్యకర్తలు ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భూక్యా హర్జ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండలంలోని వెంకట్యాతండాలో అమరవీరుల వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నూతన ప్రజాస్వామ్య విప్లవం కోసం తమ జీవితాలను పేదల కోసం ప్రాణాల అర్పించిన అమరవీరులకు జోహార్లు అర్పించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వాదులను, ప్రజలను తీవ్ర నిర్బంధానికి గురిచేస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎట్టి నరసింహారావు, డేగటి లాలయ్య, అంగోతు బాలు, గుగులోతు సంధ్య, ధరావత్ వెంకన్న, కానుగుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ ఉద్యోగికి 'నంది' పురస్కారం


పురస్కారం అందుకుంటున్న వీరమోహన్

పాల్వంచ: కేటీపీఎస్ ఉద్యోగి దాసరి వీరమోహన్ పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చారు. ఇటీవల హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో కేఎన్‌డీ చారిటబుల్ ట్రస్ట్, విశ్వ విఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పౌరాణిక, నటన, రచయిత, గాయకుడి విభాగంలో ప్రతిభ కనబర్చగా 'గౌతమి స్వర్ణ నంది 2024'పురస్కారం, ప్రశంసాపత్రంతో సత్కరించారు. అదేవిధంగా జూరాల నందు టీజీ జెన్‌కో ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక పోటీల్లో మేరా భారత్ మహాన్ నాటికకు ఉత్తమ ద్వితీయ బహుమతి, నారద మహర్షి ఏకపాత్రాభినయానికి ప్రత్యేక బహుమతి లభించింది. ఈ సందర్భంగా బుధవారం పలువురు పట్టణ ప్రముఖులు, అధికారులు, ఉద్యోగులు ఆయనను అభినందించారు.

రేపు అమరవీరుల సంస్మరణ సభ

ఇల్లెందు: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో ఈ నెల 8న అమరవీరుల సంస్మరణ సభ పట్టణ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ అనుబంధ టీయూసీఐ జిల్లా నేతలు యాకుబ్‌షావలీ, మల్లెల వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఇల్లెందులోని మున్సిపల్ శానిటేషన్, వాటర్ సప్లై, మస్టర్ అడ్డాల వద్ద జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడారు. భారత విప్లవోద్యమంలో పీడీత ప్రజల విముక్తి కోసం తమ నిండు ప్రాణాలను అర్పించిన అమరవీరులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం 11 గంటలకు జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు.

యాష్ తరలింపునకు అనుమతులు ఇవ్వండి..

పాల్వంచ: కేటీపీఎస్ యాష్ పాండ్‌ల నుంచి బూడిద తరలింపునకు ఎంపిక చేసిన వారికి వెంటనే అనుమతులు ఇవ్వాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో కాలుష్య ప్రభావిత గ్రామాలైన గిరిజన కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గత సెప్టెంబర్‌లో ఐటీడీఏ పీఓ బూడిద తరలింపు కోసం దరఖాస్తులు స్వీకరించారని, వారిలో 39 మందిని ఎంపిక చేశారని, నెల రోజులు గడుస్తున్నా వారికి అనుమతులు ఇవ్వక పోవడంతో బూడిద తరలింపు ఆలస్యం అవుతోందన్నారు. దీని వల్ల బూడిద నిల్వలు పెరిగి కాలుష్యం అధికం అవుతున్నట్లు చెప్పారు. తక్షణం అధికారులు స్పందించాలన్నారు. కార్యక్రమంలో కేటీపీఎస్ ఎస్సీ, ఎస్టీ, వడ్డెర, జనరల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు ధర్మసోతు చందర్, డిష్ నాయుడు, భట్టు చందునాయక్, భట్టు రవి, పాషా, కృష్ణ, వీరన్న, వీరు, అశోక్, జవహార్, అశోక్, కిషోర్, శ్రీకాంత్, సీతారాములు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

24న భగవద్గీత కంఠస్థ పోటీలు

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 24వ తేదీన భగవద్గీత కంఠస్థ పోటీలను నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యాలయ ప్రముఖ్ గోపిరెడ్డి భాస్కరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1వ తేదీన జిల్లా స్థాయి, 8న రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని, 2వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు పోటీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. వివరాలకు 7569545580 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

వృత్తి విద్యను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: వృత్తి విద్యా కోర్సును క్రమశిక్షణతో నేర్చుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హెచ్.వెంకటేశ్వర్లు అన్నారు. కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న వృత్తి విద్యా కోర్సులలో భాగంగా గ్లోబ్‌సాఫ్ట్ కంప్యూటర్ ఇనిస్టిట్యూషన్‌లో కంప్యూటర్ కోర్సు ప్రాక్టికల్, జాబ్ ట్రైనింగ్ నేర్చుకుంటున్న విద్యార్థులతో నోడల్ అధికారి బుధవారం మాట్లాడారు. విద్య జీవితంలో గొప్ప స్థానానికి తీసుకెళ్తుందన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే


మాట్లాడుతున్న కరస్పాండెంట్ శ్రీనివాస్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని సిద్ధార్థ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొని విద్యార్థులకు భవిష్యత్‌పై సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

జీపీ కార్మికుల నిరసన దీక్ష


ధర్నా చేస్తున్న కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం ధర్నాచౌక్ వద్ద ఒకరోజు నిరాహార దీక్ష చేసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాపితంగా 40వేల మంది కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ఈనెల 20 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ రమాదేవి, జిల్లా గ్రామ పంచాయతీ కార్యనిర్వహణాధికారి రమణారావులకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దొడ్డ రవికుమార్, కె.సత్య, డి.వీరన్న, భూక్యా రమేష్, నిమ్మల మధు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, యాకూబ్, సురేష్, వెంకన్న, కళ్యాణ్, విజయ్, రుక్మాందర్‌రావు, చెన్నకేశవులు, మనోజ్‌రెడ్డి, విజయలక్ష్మి, రేవతి, భవాని తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన


మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

కొత్తగూడెంఅర్బన్: పెరుగుతున్న సాంకేతికతకు రెట్టింపుగా పెరుగుతున్న సైబర్ మోసాలను అరికట్టడంలో భాగంగా సైబర్ సెక్యూరిటీ సెల్ పనిచేస్తుందని త్రీటౌన్ సీఐ శివప్రసాద్ తెలిపారు. బుధవారం త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని సీనియర్ సిటిజన్స్‌తో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ టెక్నాలజీ బాగా పెరిగిపోయి ప్రతీ ఒక్కరికి స్మార్ట్ మొబైల్స్, ఇంటర్నెట్ అందుబాటులో ఉంటున్నాయని, నగదు బదిలీలు, బ్యాంకింగ్ వ్యవహారాల కోసం ప్రతీ వినియోగదారుడు ఇంటర్నెట్‌పై ఆధారపడుతున్నారని తెలిపారు. ఇందులో భాగంగా సీనియర్ సిటిజన్స్ కూడా సైబర్ మోసగాళ్ల బారినపడి ఆర్థికంగా నష్టపోతున్నట్లు చెప్పారు. ఫేస్‌బుక్, వాట్సప్, స్కైప్, ఇన్‌స్టాగామ్ సామాజిక మాధ్యమాల ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజలకు మెసేజ్‌లు పంపిస్తూ ఫోన్ చేస్తూ బహుమతులు వచ్చాయి, మంచి ఆఫర్స్ ఉన్నాయి అంటూ లింకు ద్వారా సమాచారాన్ని చేరవేసి వ్యక్తిగత వివరాలను అందులో నమోదు చేయమంటారు. అలాగే బ్యాంక్ అకౌంట్ వివరాలు ఓటీపీ వివరాలను చెప్పమంటారు ఎవరూ అలాంటి సందేశాలను నమ్మి వ్యక్తిగత వివరాలను అపరిచితులకు ఇవ్వొద్దని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసాల బారిన పడినట్లు గుర్తిస్తే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

జూలూరుపాడు: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. సైబర్ జాగృత దివస్ సందర్భంగా బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక సబ్ మార్కెట్ యార్డులో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెడ్‌కానిస్టేబుళ్లు మల్లయ్య, శ్రీనివాసరెడ్డి, కానిస్టేబుళ్లు వెంకట్, కోటేశ్వరరావు, వ్యాపారులు, హమాలీలు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి


ఇల్లెందులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్, కమిషనర్లు కనకయ్య, డీవీ, శ్రీకాంత్ తదితరులు

ఇల్లెందు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని 10వ వార్డులో ఇంటింటి సర్వేను సందర్శించి పరిశీలించారు. సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సర్వే తీరును ఎమ్మెల్యేకు వివరించారు. 6,7,8 తేదీలలో గృహాల గుర్తింపు ప్రక్రియ ఉంటుందని, 9 నుంచి సర్వే ప్రారంభం అవుతుందన్నారు. ఒక్కో ఎన్యురేటర్‌కు 150 గృహాలు కేటాయించినట్లు చెప్పారు. ప్రతీరోజు పది గృహాలు సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సర్వేలో 56 ప్రశ్నలు ఉంటాయని 75 అంశాలు కుటుంబ యజమాని నుంచి సేకరిస్తారని తెలిపారు. అనుమానాలు ఉంటే సూపర్‌వైజర్లు వెంట ఉంటారని తెలిపారు. మేనేజర్ అంకుషావలీ, ఆర్ఐ శ్రీనివాస్, మెప్మా సిబ్బంది, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, ఫతే అహ్మద్ తదితరులు ఉన్నారు.

పాల్వంచరూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో అధికారులకు ప్రజలు సహకరించాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. జగన్నాథపురం గ్రామంలో బుధవారం సర్వే మొదటి రోజు కార్యక్రమాన్ని ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ నారాయణలతో కలిసి కొత్వాల పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సాయిరాం, కొండం పుల్లయ్య, నందనాయక్, బాదర్ల జ్యోషి, బాలినేని నాగేశ్వరరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


జూలూరుపాడు: కాకర్లలో స్టిక్కర్ అంటిస్తున్న ఎన్యూమరేటర్లు


సుజాతనగర్: సింగభూపాలెంలో...

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గంటల నుండి రాత్రి 8-00 గంటల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్ దుర్గారాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148